క్లుప్తంగా

ఆర్‌బీఎస్‌కే సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో బాల ఆరోగ్య రక్షణకు మొబైల్ వాహనాల్లో పని చేసిన సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మొబైల్ హెల్త్ టీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో మొబైల్ హెల్త్ టీం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. మొబైల్ హెల్త్ టీం రాష్ట్ర అధ్యక్షురాలు తోట ఫణికుమారి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి 18 ఏళ్ల వయసు వారికి మొబైల్ వైద్య సేవలు అందించేందుకు 2018లో ఆర్‌బీఎస్‌కే ప్రారంభించడం జరిగిందన్నారు. అప్పట్లో 2,500 మందిని ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్‌టీంలో ఏఎన్‌ఎం, డాక్టర్స్, డ్రైవర్స్, డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేసేందుకు ప్రభుత్వం నియమించిందన్నారు. ఆ తర్వాత కరోనా సమయంలో నిలిపివేశారన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తొలి సంతకం ఆర్‌బీఎస్‌కే ఫైల్‌పైనే చేశారన్నారు. ఈ నేపథ్యంలో గతంలో పనిచేసిన తమనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ధర్నాలో మొబైల్ టీం సభ్యులు ప్రభావతి, మేఘన, నాగసోము, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామికి ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి 132వ జయంతి సందర్భంగా చినకంచి క్షేత్రంలో మంగళవారం అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ప్రాత కాలాభిషేక అర్చన అనంతరం స్వామి వారికి మాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని బ్రహ్మశ్రీ జొన్నవిత్తుల వెంకట రామ శర్మ ఆధ్వర్యంలో చేశారు. భస్మాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం స్వామికి అలంకరణ చేసి లక్షమల్లెలతో అర్చన చేశారు. అనురాధ స్వస్తి నివేదన నిర్వహించారు. వసంత రుతువు సందర్భంగా సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణం వేద పండితులు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా చేశారు. వేద విద్యార్థులు ఉపనిషత్ పారాయణ చేసి, జంగల్వల ఉమామహేశ్వరరావు దేవాలయంలో మొదటిసారి తులాభారం తూగి పటిక బెల్లాన్ని, కందిపప్పును ప్రసన్న వెంకటేశ్వరస్వామికి సమర్పించారు. భక్తులందరికి తీర్థప్రసాద వినియోగంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేదసభ నిర్వహించారు.

సూక్ష్మ రుణ ప్రణాళికలు సిద్ధం చేయండి

పెనమలూరు: జీవనోపాధుల కోసం సూక్ష్మ రుణ ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.హరిహరనాథ్ తెలిపారు. గంగూరులో వెన్నల గ్రామ సంఘం జీవనోపాధుల సూక్ష్మ ప్రణాళికల గురించి మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హరిహరనాథ్ మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలో గంగూరు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. స్వయం సహాయ సంఘాలకు జీవనోపాధికి సూక్ష్మ రుణ ప్రణాళికలు సిద్ధం చేస్తే రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. స్వయం సహాయ సంఘాలు ఏమి వ్యాపారం చేయాలో ముందుగా సభ్యులు చర్చించుకొని సర్వేలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం జి.కృష్ణంరాజు, సీసీ సీహె చ్.ఝాన్సీ, సీసీలు, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దేవుడి భూమి స్వాధీనం

కంకిపాడు: దేవస్థానం భూమిని దేవదాయశాఖ అధికారులు ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్నారు. పెనమలూరు మండలం తాడిగడప గ్రామానికి చెందిన శ్రీ సీతారామస్వామి దేవస్థానంకు చెందిన ఆలయ భూములు తెన్నేరు గ్రామంలో ఆర్ఎస్ నంబరు 374, 375లో 1.04 ఎకరాలు ఉంది. అర్చక సర్వీసు కింద ఇచ్చిన ఈ భూములు తదుపరి చేమార్పిడి జరిగాయి. రెవెన్యూ రికార్డుల్లోనూ మార్పులు జరిగాయి. విషయాన్ని గుర్తించిన దేవదాయశాఖ అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపించారు. రెవెన్యూ రికార్డులను సరిచేయించి దేవస్థానం భూమిని ఎట్టకేలకు దేవదాయ శాఖ పరిధిలోకి మార్పు చేయించారు. ఈ భూమిని మంగళవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత భూమిలో బోర్డులు పాతించారు. ఏసీ ఎన్వీ సాంబశివరావు, ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్, ఈఓ బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

మురుగునీటి తటాకాలుగా ఖాళీ స్థలాలు



కేదారేశ్వరపేట రెండో లైన్‌లో ఖాళీ స్థలంలో పేరుకున్న వ్యర్థాలు



మూడో లైన్‌లో ఖాళీ ప్లాట్స్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు

- కేదారేశ్వరపేటలో డంపింగ్ కేంద్రాలుగా మారిన వైనం
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక కేదారేశ్వరపేటలో ఉన్న ఖాళీ స్థలాలు మురుగు నీటి తటాకాలుగా మారటంతో పాటు చెత్త డంపింగ్ కేంద్రాలుగా తయారయ్యాయి. ఖాళీగా ఉన్న ప్లాట్స్ స్థానికులకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి. పదుల సంఖ్యలో ఉన్న ఖాళీ ప్లాట్స్ చెత్త, చెదారంతో నిండి దోమలకు ఆవాసకేంద్రాలుగా మారాయి. ఏళ్ల తరబడి నుంచి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా అలానే వదిలేయడంతో పెద్ద మొత్తంలో మొక్కలు ఏపుగా పెరిగి క్రిమి కీటకాలకు నిలయంగా మారాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోని వ్యర్థాలను ఖాళీగా ఉన్న ప్లాట్స్‌లో పడేయడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది వీధుల్లో సేకరించిన వ్యర్థాలను సైతం తిరిగి ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో పడేస్తున్నట్లు స్థానిక మహిళలు వాపోతున్నారు. కుళ్లిపోయిన వ్యర్థాల కారణంగా దుర్గంధం వెదజల్లి ఇళ్లలో ఉండలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి కారణంగా పిల్లలు, వృద్ధులు తరచుగా అనారోగ్యం బారిన పడుతున్నారని చెబుతున్నారు.

విజృంభిస్తున్న దోమలు, విష పురుగులు....

ఇళ్ల మధ్య పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగిపోవడంతో దోమలు, విష పురుగులు చేరి తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు. చెట్ల మధ్య చేరిన విష పురుగుల కారణంగా తమ పిల్లలకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడాల్సి వస్తుందని అంటున్నారు. ఒక పక్క స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర, డ్రైడే–ఫ్రైడే అంటూ ఊదరకొడుతున్న వీఎంసీ అధికారులు స్థానికంగా నెలకొన్న అధ్వాన పారిశుద్ధ్యం గురించి పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఖాళీస్థలాలు అధ్వానంగా మారినా నగర పాలక సంస్థ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దోమకాటుతో అల్లాడుతున్నాం



కేదారేశ్వరపేటలో నెలకొన్న పరిస్థితులపై స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. వస్తాం.. చూస్తాం.. చేస్తాం అంటు చెప్పడం తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాము. మండుతున్న ఎండా కాలంలోనూ దోమకాటుతో అల్లాడుతున్నాము. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి.

– అనిల్, స్థానికుడు

ప్రతి రోజు డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్న వీఎంసీ అధికారులు, సిబ్బందికి ఇక్కడి సమస్య తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎండాకాలంలోనూ దోమలు, విష పురుగులతో సహవాసం చేయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికై నా అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయిన్లలో తాగునీటి పైపులైన్లు తొలగించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

మధురానగర్(విజయవాడసెంట్రల్)/పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు తాగునీటి సరఫరా చేసే విషయంలో అశ్రద్ధ వహించవద్దని, ప్రత్యేకంగా డ్రెయిన్లలో తాగునీటి పైపులైన్లు ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పర్యటనలో భాగంగా ఆయన 30వ డివిజన్ దేవీనగర్, జీవీఆర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డ్రెయిన్లలో తాగునీటి పైపులైన్లు ఉండటం చూసి ఇకపై ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పైపులైన్లు విడిగా ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమినిటీ సెక్రటరీలు ప్రతిరోజు తాగునీటి శుద్ధత పరీక్షలు చేయడమే కాకుండా ఆయా వార్డుల్లో పర్యటించి డ్రెయిన్లలో ఎలాంటి తాగునీటి పైపులైన్లు కలవకుండా చూసుకోవాలని చెప్పారు. దీనిపై అధికారులు ప్రతిరోజు నివేదికను సమర్పించాలని ఆదేశించారు. జీవీఆర్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ సర్వీస్ లెవెల్ రిజర్వాయర్(ఈఎల్ఎస్ఆర్) డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం మానవత్వానికి మరోరూపం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రక్తదానం మానవత్వానికి మరోరూపమని, ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సూర్యారావుపేటలోని శ్రీధర్ కోచింగ్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయనే అపోహలు వీడి యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అనేక మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, థలసీమియా రోగులు ఆరు వేల వరకు ఉన్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కొమ్మూరి శ్రీధర్, సీతారామిరెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): పన్నులు నగర అభివృద్ధికి మూలస్తంభాలని, ప్రజల నుంచి రావాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేయడం ప్రతి అడ్మిన్ సెక్రటరీ బాధ్యతని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ సమీక్ష సమావేశం జరిగింది. వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సృజనతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజూ వార్డు సెక్రటరీలు ప్రజల నుంచి పన్నులను వసూలు చేసే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అడ్మిన్ సెక్రటరీలు తమ విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్‌కు వివరించగా.. సెక్రటరీలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి సమస్యల పరిష్కరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, శర్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

హోటల్, డార్మిటరీ ఏర్పాటుకు స్థలం కేటాయింపు



మాట్లాడుతున్న ఆర్‌ఎం డి.వై దానం

బస్టాండ్(విజయవాడపశ్చిమ): పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లోని డిపార్చర్ బ్లాక్ వద్ద ఉన్న 31.700 చదరపు అడుగుల విస్తీర్ణంలోని స్థలాన్ని శ్రీనివాస్ అనే వ్యక్తికి కేటాయించినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఎన్టీఆర్ జిల్లా రీజనల్ మేనేజర్ డి.వై దానం తెలిపారు. మంగళవారం ఆర్టీసీ భవనంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పీఎన్‌బీఎస్ డిపార్చర్ బ్లాక్ గేటు–1 వద్ద గతంలో ఉన్న బాలాజీ క్యాంటీన్, డార్మిటరీ, పార్కింగ్ లీజు ముగియడంతో కొత్తగా టెండర్లను ఆహ్వానించామని తెలిపారు. రూ.54 లక్షల ధరకు టెండర్ దరఖాస్తు చేసుకున్న వ్యక్తి డిపాజిట్ చెల్లించే సమయంలో వెనక్కు తగ్గడంతో ఆ తరువాత రూ.45 లక్షలు బిడ్ చేసిన రెండవ వ్యక్తికి టెండర్‌ను మొదటి వ్యక్తి బిడ్ చేసిన ధరకు తగినట్టుగా పెంచమని కోరామన్నారు. కానీ అందుకు తాను వేసిన బిడ్‌కు అదనంగా రూ.500 కంటే ఎక్కువ చెల్లించుకోలేనని తెలపడంతో వరుసలో మూడో వ్యక్తి రూ.46,01,980కు బిడ్ పెంచడంతో ఆయనకే స్థలాన్ని ఎలాట్‌మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ అగ్రిమెంట్ ఐదు సంవత్సరాలు వరకు ఉంటుందన్నారు. లీజు ప్రకారం బస్‌స్టేషన్‌లో హోటల్, డార్మిటరీ, పార్కింగ్‌కు అనుమతులు ఉంటాయని వెల్లడించారు.

మాస్టర్ అథ్లెట్ గంగాధర్ క్రీడా ఖ్యాతి అభినందనీయం



మాస్టర్ అథ్లెట్ కంది గంగాధరరావు సన్మానించిన దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో 87 ఏళ్ల వయసులోనూ సత్తా చాటి విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటుతున్న మాస్టర్ అథ్లెట్ కంది గంగాధరరావు కృషి, పట్టుదలను రైల్వే వాకర్స్ సంఘం, రైల్వే రెజ్లర్స్ సంఘం, రైల్వే వెయిట్ లిఫ్టింగ్ సంఘం ప్రతినిధులు కొనియాడారు. గంగాధరరావు 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే వ్యాయామశాలలో క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు మంగళవారం ఆయనను సన్మానించారు. చిన్న వయసులోనే కుస్తీ పోటీల్లో రాణించి దేశవ్యాప్తంగా కీర్తి గడించారని గుర్తు చేశారు. వయసు పైబడిన విశ్రాంతి తీసుకోకుండా నేటికీ క్రీడల్లో రాణిస్తూ అనేక జాతీయ, అంతర్జాతీయ పతకాలను సాధిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఇటీవలే సన్మానం పొందారని తెలిపారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా క్రీడాకారులకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జీవీ ప్రసాదరావు, రైల్వే వాకర్స్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్ సంఘాల ప్రతినిధులు మణిబాబు, సాగర్, శరత్ పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఎన్టీఆర్ జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన కార్మికుల హక్కులను, చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు పూనుకోవడం దుర్మార్గ చర్య అన్నారు. 20న విజయవాడ నగరంలో వన్ టౌన్ రథం సెంటర్ నుంచి లెనిన్ సెంటర్ వరకు నిరసన, ప్రదర్శన, అనంతరం సభ జరుగుతుందన్నారు. సమ్మెకు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈవీ నారాయణ, సీఐటీయూ జిల్లా నాయకులు కే దుర్గారావు, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మరీదు ప్రసాద్‌బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మునిశంకర్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు లక్ష్మణరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ఏఐటీయూసీ సీహెచ్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జీఐజీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ప్రశంసలు



రామ్ చరణ్ తేజ్




యశశ్వినిరెడ్డి



మహ్మద్ అర్షఖ్ నురాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీబీఎస్ ఈ బోర్డ్ పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఫస్ట్ క్లాసులో ఉత్తీర్ణత సాధించిన ఏకై క పాఠశాల గొల్లపూడి పరిధిలోని జీఐజీ ఇంటర్నేషనల్ స్కూల్ (అండర్ జీఐజీ ఎడ్యుకేషన్ ట్రస్ట్) అని వైస్ ప్రిన్సిపాల్ రమ్య తెలిపారు. స్కూల్‌లో మొత్తం 84 శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత పొందగా 37 శాతం విద్యార్థులు 90 శాతానికిపైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈ విజయం వెనుక విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కృషి ఉందని అన్నారు. పి.రామ్ చరణ్ తేజ్ 481/500 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవగా కె.యశశ్విని రెడ్డి 478/500 మార్కులు, మహమ్మద్ అర్షఖ్ నురాజ్ 477/500 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం విద్యార్థులను ప్రశంసించిందని చెబుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్ఎస్ఎం స్కూల్ విద్యార్థులకు అభినందనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. నిహాల్ ముప్పవరపు 491 మార్కులతో స్కూల్ ఫస్ట్‌రాగా శాన్వి సాయి చుండూరు, భాగ్యశ్రీ మాటూరి 487 మార్కులతో ద్వితీయ స్థానం, నేహా రెడ్డి నల్లబెల్లి తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష రాసిన 237 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై నూరు శాతం ఫలితాలను సాధించి 98.2 శాతం నమోదు చేశారని తెలిపారు. ఫలితాల్లో 90 నుంచి 100 మార్కులు సాధించిన విద్యార్థులు 63 మంది, 80 నుంచి 89 పొందినవారిలో 72 మంది, 70 నుంచి 79 మార్కులు సాధించిన విద్యార్థులు 59 మంది ఉన్నారని వివరించారు. ఈ విజయం వెనుక విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల శ్రమ ఉన్నాయని పేర్కొన్నారు. అభినందన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్ ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలా రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒంటరి శారీరక దివ్యాంగులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఒంటరి పురుషులు, మహిళలకు నూతన నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఒంటరి శారీరక దివ్యాంగులకు కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఒంటరిగా ఉంటున్న శారీరక దివ్యాంగులను ఆదుకునేందుకు 35 కిలోల బియ్యం అందించే అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డులు ఇవ్వాలని కోరారు.

కూటమి పాలనలో హిందూ ధర్మానికి పెను ప్రమాదం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి పరిపాలనలో హిందూ ధర్మానికి పెను ప్రమాదం ఏర్పడిందని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ దేవాలయాల, దేవుళ్ల భూములు కొట్టేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. అందుకే వేలం లేకుండా ఇష్టానుసారం కూటమి నేతలకు, వారి బంధువులకు, వారి స్నేహితులకు ఇలా వారికి నచ్చిన వారికి లీజుకు ఇస్తోందని ఆరోపించారు. వందల వేల కోట్ల రూపాయల విలువచేసే దేవుడి భూముల్ని కబ్జా చేసేందుకే చట్టాన్ని మార్పు చేశారని దుయ్యబట్టారు. ఇప్పటివరకు బహిరంగ ప్రకటన ఇచ్చి వేలం ద్వారా 11 సంవత్సరాలకి మాత్రమే వ్యవసాయ, వ్యవసాయతర కమర్షియల్ భూములను లీజు ఇచ్చేవారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీన్ని మార్పు చేసి 33 సంవత్సరాలకు దేవుడు భూములను కట్టబెట్టేలా చట్టాన్ని మార్చారని విమర్శించారు. పగలు పూజలు చేస్తున్నట్టు నటించడం, రాత్రిపూట హిందూ దేవాలయాల భూములను దొంగతనంగా అడ్డదారిలో కొట్టేయడం ఇది చంద్రబాబు పవన్‌క ల్యాణ్, బీజేపీ నాయకులు కలిసి చేస్తున్న కుట్రని పేర్కొన్నారు. బాబు, పవన్, పురంధరీశ్వరి కలిసి హిందూ దేవుళ్ళ భూములను నీ కెంత నా కెంత క్విడ్స్ ప్రోకోలో పంచుకుంటున్నారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీటీడీని రాజకీయాలకు వాడుకొని లడ్డు ప్రసాదాన్ని రాజకీయం చేశారని గుర్తుచేశారు. కూటమి నాయకులు చేసిన పాపానికి ముక్కోటి ఏకాదశి నాడు తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించారని, ఈ ఘటన మరవక ముందే సింహాచలంలో గోడకూలి ఏడుగురు భక్తులు మృతిచెందారని ఆందోళన వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల్లో వృత్తి నైపుణ్యం పెంపునకు కృషి

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్



ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన సురేష్‌ను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జర్నలిస్టుల్లో వృత్తి నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తానని సీ రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ఆలపాటి సురేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించిన నేపథ్యంలో మంగళవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్, సామ్నా నాయకులు సురేష్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అకాడమీ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏపీయూడబ్ల్యూజే నేతలు మాట్లాడుతూ జర్నలిస్టులకు వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. చైర్మన్‌గా సురేష్‌ను నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అర్బన్ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కే జయరాజ్, డీ నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, అర్బన్ యూనిట్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా నగర అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, యూనియన్ నాయకులు జీ రఘురామ్, శివరామకృష్ణ, అహ్మద్ హుస్సేన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలల పరిరక్షణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి స్కీంలపై మంగళవారం సమీక్ష జరిగింది. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షలో పద్మావతి పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. లైంగిక బాధితులకు పరిహారం అందించాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పిల్లలకు మిషన్ వాత్సల్య గైడెన్స్ ఆధారంగా ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు. లైసెన్స్, అర్హత కలిగిన బాలల సంరక్షణ కేంద్రాలు మాత్రమే నడపాలని డీపీవోను ఆదేశించారు. రిజిస్టర్లు, డాక్యుమెంటేషన్, రికార్డులు భద్రపర్చుకోవాలని సూచించారు. రెస్క్యూ చేసిన బాలలకు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆర్డర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేశ్వరరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సువార్త, రవి భార్గవ్, డీపీఓ జ్యోతి, సీడీపీఓలు మంగమ్మ, జ్యోష్న, పుష్పలత, సత్యవతి, కృష్ణ కుమారి, లక్ష్మి భార్గవి తదితరులు పాల్గొన్నారు.